క్లుప్తంగా

'మధ్యాహ్న' బిల్లులు చెల్లించండి



మద్నూర్(జుక్కల్) : అప్పులు చేసి విద్యార్థుల కు భోజనం వండి పెడుతున్నాం.. తమకు రావాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీలు డిమాండ్ చేశాయి. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన చేపట్టి తహసీల్దార్ ముజీబ్‌కు వినతి పత్రం అందించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల ఆందోళనతో శుక్రవారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

రుణమాఫీ హామీ నిలబెట్టుకున్నాం



నిజాంసాగర్(జుక్కల్): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీని మూడు విడతల్లో అమలు చేసి ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ మహమ్మద్ నగర్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకలక్ష కూడా రుణమాఫీ చేయలేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లయ్యగారి ఆకాష్, నాగభూషణం గౌడ్, ఖాలిక్, కుమ్మరి రాములు, మొహిన్‌ఖాన్, తోట రాజు, సాయాగౌడ్, భూమాగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకొని స్టీల్‌బ్యాంకును ఏర్పాటు చేసుకోవాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాసాన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలురికార్డులను పరిశీలించారు. దీంతోపాటు ఫ్రైడే డ్రైడేలో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి చాలాకాలంగా నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. పంచాయతీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి, కారోబార్ నర్సింలు ఉన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి



కామారెడ్డి టౌన్ : పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ భవనాలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి నిధులు ఎలా కేటాయిస్తారని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి విశాల్ ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగానికి కేటాయించాల్సి నిధులను ఒక ఉపాధ్యాయ సంఘానికి కేటాయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కామారెడ్డి టౌన్ : పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులు జిల్లా కేంద్రంలోని అక్షర స్కూల్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైతే బాధితులు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సైబర్ క్రైం సిబ్బంది ప్రవీణ్, సాయిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ఏఎస్సై బదిలీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ఏఎస్సై లచ్చీరాంనాయక్ శుక్రవారం బదిలీఅయ్యారు. సుమారు నాలుగేళ్లపాటు నాగిరెడ్డిపేట ఏఎస్సైగా విధులు నిర్వహించిన లచ్చీరాం నాయక్ రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బదిలీపై వెళ్తున్న ఏఎస్సైని నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తన సిబ్బందితో కలిసి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సత్కరించారు.

గుండెపోటుతో కళాకారుడి మృతి



లింగంపేట: మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన మంగళి రాజు(50) గురువారం రాత్రి గుండె పోటుతో మృతి చెందినట్లు గ్రామస్తు లు తెలిపారు. రాజు 1991 నుంచి ప్రభుత్వ ప థకాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించేవా డు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డీపీఆర్‌వో, కలెక్టర్ సమక్షంలో ఎన్నో సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ధూమ్ ధామ్ ప్రోగ్రాంలు నిర్వహించాడు.

తీరుమారని పల్లెలు..

- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త
- అధ్వానంగా డ్రెయినేజీలు

మాచారెడ్డి : మండలంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు రోగాలపాలవుతున్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోయి చిన్నాపెద్దా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని లక్ష్మీ రావులపల్లి, భవానీపేట, పాల్వంచ గ్రామాల్లో 20 వరకు డెంగీ కేసులు నమోదై బాధితులు ఆస్పత్రి పాలయ్యారు. ఎక్కువశాతం చిన్న పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. వైద్య శిబిరం నిర్వహించినా డెంగీ కేసులు ఎక్కువ నమోదైన లక్ష్మీ రావులపల్లిలో మూడు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహించినా జ్వరతీవ్రత ఏమాత్రం తగ్గట్లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులపాటు శిబిరం నిర్వహించి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. శిబిరం ఎత్తేసిన అనంతరం ఆశవర్కర్లు ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది శిబిరం నిర్వహించినా, ఇంటింటికి తిరుగుతూ సర్వే చేసినా జ్వర పీడితులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి రూ. వేలల్లో ఖర్చు చేస్తున్నారు. అక్కడక్కడా డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు నమోదవుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్లు పలువురు జ్వర పీడితులు తెలిపారు.

పెరిగిన పిచ్చి మొక్కలు, కంపు కొ డుతున్న డ్రెనేజీలు ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పారిశుధ్యం లోపిస్తోంది. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారులను నియమించారు. అయితే ప్రత్యేకాధికారులు గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో పారిశుధ్యం అటకెక్కింది.



చుక్కాపూర్‌లో మురికి కాల్వ పక్కన పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త

దోమలతో పరేషాన్



మురికికాల్వల్లో చెత్తాచెదారం నిండిపోయి కంపు కొడుతున్నాయి. దాంతో దోమలు ఎక్కువై పరేషాన్ చేస్తున్నాయి. దోమల వల్ల అనేక రకాల రోగాలు వచ్చి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం.

– రాజిరెడ్డి, గ్రామస్తుడు, చుక్కాపూర్

చెత్త అలాగే ఉంటోంది



గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయి కంపు కొడుతోంది. చెత్తను తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రాము, గ్రామస్తుడు, గజ్యానాయక్ తండా

సీపీఎస్‌ను రద్దు చేయాలి



భవానీపేటలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



పిట్లంలో ప్రభుత్వ పాఠశాలలో..

సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని పేర్కొంటూ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



మత్తమాల జెడ్పీ పాఠశాలలో..



బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో..



ధర్మారావ్‌పేట్‌లో..



దోమకొండ మండల పరిషత్ వద్ద..



నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం ఎదుట..

పారిశుధ్య పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని కోమట్‌పల్లి గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న మురికి నీటిని గ్రామ పంచాయితీ కార్మికులచే తొలగింపజేశారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. గ్రామ పెద్దలు నెల్లూరి గంగారం, వెల్పుల గంగారాం, అంగన్‌వాడి టీచర్ పద్మ ఉన్నారు.

గిరిజన మోర్చా నూతన కమిటీ



పిట్లం(జుక్కల్) : మండలంలోని నూతన గిరిజన మోర్చా కమిటీని శుక్రవారం మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోపాల్ సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మదన్ నాయక్, ఉపాధ్యక్షులుగా మెగావత్ చందు, కడవత్ రమేష్, ప్రధాన కార్యదర్శిగా సునావత్ రాందాస్, కోశాధికారిగా పి భారత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన మోర్చా సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ అర్జున్ వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో దేవిసింగ్ తదితరులున్నారు.

బాయంపల్లిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బాయంపల్లి, బాయంపల్లి తండాలో శుక్రవారం ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి హిమబిందు తెలిపారు. జ్వరపీడితులకు చికిత్సలు చేశామన్నారు. తండావాసులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సరిత, లక్ష్మన్, వినోద వర్కర్లు పాల్గొన్నారు.

కల్యాణిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని కల్యాణిలో శుక్రవారం ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీఓ లక్ష్మి, ఆయూష్ సిబ్బంది స్వరూప ఉన్నారు.

వికలాంగ విద్యార్థులకు..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం వికలాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఫిజియోథెరపిస్ట్ విశలాక్షి 9 మంది వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. టీచర్లు కమల్ కిషోర్, గంగాధర్, సిఆర్‌పి పాష తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన టీచర్లకు సన్మానం



మాచారెడ్డి : మండలంలోని చంద్రునాయక్ తండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కరుణ, ఉపాధ్యాయురాలు అర్చన ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ మేరకు శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పరశురాములు, టీచర్ రామేశ్వరి తండావాసులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

చుక్కాపూర్ ఆలయంలో కుంకుమార్చనలు



మాచారెడ్డి : శ్రావణ మాసం మూడో శుక్రవారం మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, జిల్లాల నుంచి తరలిన వచ్చిన మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది సంతోష్, సురేందర్ గుప్తా, అర్చకులు ఉన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, పాదుకలను అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బీబీపేట : మండలంలోని యాడారం గ్రామంలో నూతనంగా నిర్మించినటువంటి నల్లపోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉదయం నుండి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో జలాభిషేకం



పిట్లం(జుక్కల్): మండలంలోని గౌరారం గ్రామస్థులు వర్షాలు సమృద్ధిగా కురవాలని శుక్రవారం బిందెలలో నీళ్లు మోసి ఆంజనేయస్వామి గర్భగుడిని నీటితో నింపి స్వామివారికి జలాభిషేకం చేశారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



సదాశివనగర్‌లో చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రాజంపేటలో కేజీబీవీ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



సింగరాయపల్లిలో చంద్రుని ఆకారంలో విద్యార్థులు



అచ్చంపేట మోడల్ పాఠశాలలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతరిక్ష దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భౌతికశాస్త్ర విభాగ అధ్యాపకులు ఖగోళ శాస్త్ర, ఆస్ట్రోనాట్ల గొప్పతనంపై వివరించారు. చంద్రయాన్–3ని చంద్రుడి ఉపరితలంపైనా విజయవంతంగా ప్రయోగించినందుకు గౌరవ సూచకంగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేట : అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజంపేట కస్తూర్బా పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. చంద్రయాన్-3 ల్యాండర్‌ను చంద్రుడిపై విజయవంగా దిగిన రోజును అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆంగ్ల ఇస్రో పదం ఆకృతిలో కూర్చుని ఇస్రో గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సూపరిడెంట్ శ్రీవాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : పాల్వంచ మండలం సింగరాయపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రుని ఆకారంలో ప్రదర్శన నిర్వహించి అందరిని అబ్బురపర్చారు. అంతరిక్ష యాత్రికుడు గతంలో ఆగస్ట్ 23న చంద్రుని పైన కాలు మోపిన 'నీల్ ఆమ్ స్ట్రాంగ్' గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు, హెచ్‌ఎం శ్రీపతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

చంద్రయాన్–3 ఆకారంలో..

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట ఆదర్శ మోడల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు చంద్రయాన్–3 ఆకారంలో కూర్చున్నారు. చంద్రయాన్–3 సక్సెస్ అయిన సందర్భంగా విద్యార్థులను టీచర్లు చంద్రయాన్ ఆకారంలో కూర్చోబెట్టారు. మోడల్ ప్రిన్సిపాల్ చంద్రకళ, టీచర్లు అనురాధ, విజయలక్ష్మి, స్వప్న తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సీఎంతో కలిసి విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సామెల్, శేకావత్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

అర్థమయ్యే విధంగా బోధించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రాథమిక స్థాయిలోని ప్రతీ విద్యార్థికి అర్థమయ్యే విధంగా బోధించాలని మండల నోడల్ అధికారి షౌకత్‌అలీ సూచించారు. లింగంపేట మండలం భవానిపేట, రాంపూర్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. నవంబర్ 24న జరిగే నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షకు 3వ తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ రాములు, హెచ్ఎం దత్తు, మంజుల, సిబ్బంది రమేశ్, ప్రణీత, సీఆర్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

భిక్కనూరు : యువత రాజకీయాల్లోకి రావాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇలియాస్ అన్నారు. శుక్రవారం ఆయనను జీఆర్ఎస్ ట్రాన్స్‌పోర్టు యాజమానులు గౌరిశెట్టి సంతోషకుమార్, శివకుమార్ సన్మానించారు. తండ్రి షబ్బీర్ అలీ బాటలో నడుస్తూ నిరుపేదలకు, కార్యకర్తలకు అండగా ఉంటున్నాడని ఆయన శాలువతో పూల మాలతో మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడు వేగవంతంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లాలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగెస్ పార్టీలోకి యువతను ఆహ్వానించి వారికి పార్టీ బాధ్యతలను అప్పగిస్తామన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి పాల్గొన్నారు.



ఇలియాస్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లో ఆధిపత్యపోరు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్య పోరు రాజుకుంది. కొన్నినెలలుగా లోలోపలే రగులుతున్న ఆధిపత్య పోరు నేడు బట్టబయలైంది. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఫొటో లేకపోవడంతో ఫ్లెక్సీని తొలగించాలని మదన్‌మోహన్ రావు వర్గీయులు రెండురోజుల క్రితం సమాచారం ఇచ్చామని ఆయన వర్గీయులు పేర్కొన్నారు. అయినా స్పందన లేకపోవడంతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, గయాజుద్దీన్ ఆధ్వర్యంలో 20 మంది కాంగ్రెస్ నాయకులు సుభాష్‌రెడ్డి స్వగృహం వద్దకు చేరుకుని ఫ్లెక్సీని తొలగించాలని విన్నవించారు. దీనికి సుభాష్‌రెడ్డి వర్గీయులు మాట్లాడుతూ మీరు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల్లో సుభాష్‌రెడ్డి ఫోటో, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఫొటో ఎందుకు పెట్టట్లేదని ప్రశ్నించారు. అవన్నీ పక్కనపెట్టి ఎమ్మెల్యే ఫొటో లేని ఫ్లెక్సీ తొలగించాల్సిందేనని పేర్కొంటూ మదన్‌మోహన్ రావు వర్గీయులు ఫ్లెక్సీని తొలగించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా, మాజీ జెడ్పీటీసీ గయాజుద్దీన్ మాట్లాడుతూ ప్రొటోకాల్‌లో భాగంగా ఎమ్మెల్యే ఫోటో లేనందుకు ఫ్లెక్సీలు తొలగించామన్నారు.



ఫ్లెక్సీని తొలగిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు వర్గీయులు

కాంగ్రెస్ నాయకులపై కేసులు..

కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని అకారణంగా తొలగించిన ఎమ్మెల్యే వర్గీయులపై సుభాష్‌రెడ్డి వర్గీయులు అఫీజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. సాయిబాబా, వినోద్‌గౌడ్, గయాజుద్దీన్, పప్పు వెంకటేశం, గోపి, అజర్, ప్రసాద్‌గౌడ్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

సంక్షిప్తం

రేపు జ్ఞాన చైతన్యానంద స్వామి ధార్మిక ఉపన్యాసం

కామారెడ్డి అర్బన్ : స్థానిక వివేకానంద కాలనీలోని సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 25న ఆదివారం 9గంటల నుంచి 11గంటల వరకు జగద్గురు గీతా ఆశ్రమం వ్యవస్థాపకులు జ్ఞాన చైతన్యానందస్వామి ఆధ్యాత్మిక ధార్మిక ఉపన్యాసం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు కొండ అశోక్, నాగెల్లి శ్రీనివాస్, తమ్మి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు, అల్పాహారం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు భూమయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ సంఘ సంభుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ గ్రామానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు భూమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని వెంటనే ఏ,బీ, సీ,డీగా వర్గీకరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవీందర్, నాయకులు సాయిలు, చిన్న పర్వయ్య, రవి, పండరి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన



బాన్సువాడ రూరల్ : మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ముస్లిం మత గురువుపై ఓ స్వామీజి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం బాన్సువాడలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సంబంధిత స్వామీజీపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మజీద్ సదర్ తస్వీర్, అలీబిన్ అబ్దుల్లా తదితరులున్నారు.

నేడు మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన శనివారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10గంటలకు మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోదబాయి అధ్యక్షతన ఈ సమావేశం ఉంటుందన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : విద్యార్థులకు మెనూప్రకారం భోజనం పెట్టాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పా ఠశాలను తనిఖీ చేశారు. పప్పులతో పాటు తాజాగా ఉండే కూరగాయలు, ఆకుకూరలను వాడాలన్నారు. వంటగదిని శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. ఎంపిడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ప్రిన్స్‌పల్ సురేఖ పాల్గొన్నారు.

ధర్మారెడ్డి జీపీ కార్యదర్శిగా రమేష్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి జీపీ కార్యదర్శిగా రమేశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ధర్మారెడ్డి పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఇటీవల మెదక్‌జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో జీపీ కార్యదర్శిగా రమేశ్‌ను నియమించారు.